క్లుప్తంగా

మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా రాజాగణేష్



సంఘ అధ్యక్షుడు రాజాగణేష్‌ను అభినందిస్తున్న సంఘపెద్దలు

ఏలేశ్వరం: శ్రీవేంకటేశ్వరా పిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సిద్దాంతపు రాజాగణేష్ ఎన్నికయ్యారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సొసైటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాజాగణేష్, కార్యదర్శిగా పాండ్రింకి సత్తియ్యలను ఎన్నుకున్నారు. ఎఫ్‌డీఓ ప్రకాశరావు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజాగణేష్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సంఘ పెద్దలు పాండ్రింకి పెదరామారావు, ఆబోతు రామారావు, పాట్నూరి పెదవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ 'థాంక్స్ గివింగ్ డే'



శారదా వయోవృద్ధ నిలయంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మోహన్

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 'థాంక్స్ గివింగ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత వైమానిక దళ ఉన్నతాధికారి (ఎయిర్ కమాండర్, న్యూఢిల్లీ), జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి శివరామకృష్ణారెడ్డి సమకూర్చిన దుప్పట్లను పేదలకు అందజేశారు. వీటిని స్థానిక జాతీయ రహదారిపై ఉన్న శ్రీశారదా వయో వృద్ధ నిలయంలోని వృద్ధులకు, స్థానిక బాప్టిస్ట్ చర్చి, ఎల్‌ఎఫ్‌టీఎల్ చర్చి, ధర్మవరంలో అబ్రహం స్వగృహం వద్ద వితంతు, నిరుపేద వృద్ధులకు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ బి.మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వయోవృద్ధ నిలయం చైర్మన్ యాళ్ల విశ్వేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రలీల, సుజన, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పంతం కృష్ణ, కె.సంజీవరావు, ఫాస్టర్ జాన్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాహం

గండేపల్లి: తాళ్లూరులో 66వ కోదండరామ ఏకాహ వార్షికోత్సవం గురువారం వైభవంగా ప్రారంభించారు. ఈనెల 29 వరకూ నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఏకాహ మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గోకవరం: మల్లవరంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం సభ్యులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా శ్రీవారి మాస కల్యాణోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామికి మాస కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు స్వామిఅమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. చాతుర్మాసం ముగింపు సందర్భంగా అద్దాల మండపం ఉయ్యాలలో ఉన్న ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్తలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

తొండంగి: పి.ఇ.చిన్నాయపాలెంలో గురువారం పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. పతంజలి ఫుడ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఉద్యానవనశాఖ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ పామాయిల్ సాగులో సూక్ష్మసేద్యం, ఎరువుల వినియోగం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్ కంపెనీ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

మూడు తుపాకులు స్వాధీనం..!

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలియవచ్చింది. వారి వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సమయంలో తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులను తుపాకులతో గుర్తించి అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా ఒక వ్యక్తి పరారయ్యాడు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను రాజమహేంద్రవరం తరలించి విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై అటవీశాఖ అధికారులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.



ప్రత్తిపాడులోని బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



జెండాలతో కళాకారుల సందడి



తీన్‌మార్.. వన్స్‌మోర్



ఆకట్టుకున్న తప్పెటగుళ్లు

ప్రత్తిపాడులో ప్రభంజనం

- సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన జనం
- కిక్కిరిసిన రోడ్లు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం



ప్రత్తిపాడులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనం

ప్రత్తిపాడు/ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రతో ప్రత్తిపాడు జనసంద్రంగా మారింది. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ప్రత్తిపాడులో ఎటుచూసినా జన సందోహమే. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు మంత్రులు, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ప్రత్తిపాడు విచ్చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. సభలో మంత్రులు మేరుగు నాగార్జున, పినిపే విశ్వరూప్, ఎంపీలు నందిగం సురేష్, వంగా గీత, ఎమ్మెల్యేలు కరసాల కన్నబాబు, పెండెం దొరబాబు, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు ప్రసంగాలకు జనం నుంచి విశేష స్పందన వచ్చింది. నాయకులు సీఎం జగన్ పాలనలోని పథకాలను వివరిస్తుండగా జనం చప్పట్లతో సంఘీభావం తెలిపారు. సాంస్కృత కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా..

రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన 'సామాజిక సాధికార యాత్ర' సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మెచ్చిన పాలన అందిస్తున్నారన్నారు. ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు, శంఖవరం ఎంపీపీలు గోళ్ళ కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, నీరుకొండ రామకుమారి, తురుం మల్లీశ్వరి, గొల్లు చిన్నదివాణం, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, జిల్లా బీసీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, చింతల రాజు, నియోజకవర్గంలో మండల పార్టీ అధ్యక్షులు పంచాది వీరబాబు, నరాల శ్రీను, అడపా పార్థసారథి, జిగిరెడ్డి శ్రీను, నాలుగు మండలాల జేసీఎస్ కన్వీనర్లు రామిశెట్టి చినబాబు, ఆర్ సూరిబాబు, బి.లచ్చరావు, ఎస్.చిన్నారావు, ఎ.వీరరాఘవ స్వామి, సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తపోవనం ఆశ్రమాన్ని సందర్శించిన తనికెళ్ల భరణి



పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొందుతున్న భరణి

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమాన్ని ప్రముఖ సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి సందర్శించారు. గురువారం తపోవనానికి వచ్చిన ఆయన రాజరాజేశ్వరీ అమ్మవారిని, మహా శివలింగాన్ని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మహాస్వామి సూచనలతో శివుడి పాటలను ఆలపించి భక్తులను తన్మయత్వపర్చారు. కార్తిక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో దివ్యనామ సంకీర్తన నిర్వహించారు. శుక్రవారం దామోదర పూజ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు సరస్వతీ మహాస్వామి తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఏలేశ్వరం: శివకేశవుల తనయుడు అయ్యప్పస్వామి పడిపూజ పట్టణంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, బదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో స్థానిక నర్సీపట్నంరోడ్ వద్ద పూజ జరిగింది. మండల వ్యాప్తంగా అయ్యప్పస్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు పూర శ్రీను, కె.ప్రభాకరరావు తదితర గురుస్వాములు పూజకార్యక్రమాలు చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి



తుని పట్టణంలో సంక్షేమ, అభివృద్ధి ఫ్లెక్సీని ఆవిష్కరించిన సీపీ సుధారాణి, నాయకులు



ఇర్రిపాకలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసిన బండారు రాజా

తుని: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజల సుఖశాంతులతో ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. గురువారం పట్టణంలోని 9, 10 వార్డులకు చెందిన సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, నాలుగున్నర ఏళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధికి సంబంధించి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి అన్ని వర్గాలకు పారదర్శకంగా పథకాలను అందించారని సీపీ సుధారాణి అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పొమర్తి మహేష్, గాంధీనత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు వాసంశెట్టి శ్రీనివాసరావు, మొల్లేటి ప్రభావతి, మార్కెట్ యార్డు డైరెక్టర్ దండెం నాగు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జి, మేడిశెట్టి గౌరీష్, త్రినాథ్, కొప్పిరెడ్డి సత్తిబాబు, నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట: ఇర్రిపాకలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ బండారు రాజా పాల్గొన్నారు. గ్రామంలో పార్టీ జెండా ఎగరవేశారు. అభివృద్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, మండల పార్టీ అధ్యక్షులు రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: కుమ్మరిలోవ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ, పార్టీ మాజీ అధ్యక్షుడు పోతల రమణ పాల్గొన్నారు. సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించి, గ్రామంలో పార్టీ జండాను ఎగరవేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు జక్కాన రామచంద్రరావు, పరవాడ లోవరాజు, చిటికెల వరహాలబాబు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

తొండంగి: బెండపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ముఖ్య అతిథిగా హాజరై సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పార్టీ నాయకులు అంగుహూరి సుశీలరాణి, ఎం.వెంకటరామయ్యచౌదరి(చిన్నబ్బు), ఆరుమిల్లి ఏసుబాబు, దూళ్లిపూడి ఆంజనేయులు, బెక్కం చంద్రగిరి, ఏలేటి ధర్మరాజు, బూసాల గణపతి, ఎంపీటీసీలు నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ రైతులకు వరం



రైతులకు మోటారు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ బాబు

తుని: వైఎస్సార్ జలకళ మెట్ట రైతుల పాలిట వరమని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు అన్నారు. గురువారం ఎస్.అన్నవరం కాపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ జలకళలో బోర్లు తవ్వి విద్యుత్ సరఫరా కల్పించిన రైతులకు మోటార్లను పంపిణీ చేశారు. జిల్లాలో 1307 బోర్లు మంజూరు చేయగా 802 బోర్లు తవ్వారన్నారు. తుని నియోజకవర్గంలో 256 బోర్లు మంజూరు చేయగా 119 బోర్లు తవ్వకం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ ఉన్న రైతులకు మోటార్లు అందిస్తున్నారు. దీంతో రైతులు పంటలు సాగు చేయడానికి అవకాశం లభించిందన్నారు. ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, పోతల రమణ, వద్దాది ఏసుబాబు, వంగలపూడి కృష్ణారావు, డ్వామా కత్తిపూడి క్లస్టర్ ఏపీడీలు పాల్గొన్నారు.

పుష్కరనీటి ప్రవాహంతో గవరపేట వాసులు బెంబేలు

తుని రూరల్: ముమ్మరంగా వరికోతలు జరుగుతుండగా పుష్కర కాలువలో నీటి ప్రవాహం అధికమవడంతో గవరపేట గ్రామస్తులు, రైతులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం రాత్రి నుంచి కాలువలోకి నీరు అధికంగా వచ్చి చేరడం, కాలువ లీకులతో పుష్కర జలాలు గ్రామంలో ప్రధాన రోడ్డుపై ప్రవహించింది. దీంతో గురువారం పుష్కర అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన జేఈ శ్రావణి, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు పుష్కర కాలువను పరిశీలించారు. జేసీబీతో వరదనీటి ప్రవాహానికి అడ్డుకట్టు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంపా రిజర్వాయర్‌లోకి ఏలేరు జలాలను విడుదల చేశారన్నారు. ఆ నీటికి కాలువలో వ్యర్థాలు అడ్డుపడడంతో పంపా రిజర్వాయర్‌లోకి వెళ్లాల్సిన జలాలు దిగువన ఉన్న పుష్కర కాలువకు చేరడం, గవరపేట వద్ద కాలువ గట్టు లీకై రోడ్డుపైకి నీరు చేరిందన్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పుష్కర జలాలు పంపా రిజర్వాయర్‌కు చేరాయన్నారు. గవరపేటలో నీటి ప్రవాహం తగ్గిందన్నారు. దీనిపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కాలువలో మురుగు తొలగించారు



డ్రైనేజీలో పూడికను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

గండేపల్లి: నీలాద్రిరావుపేటలో డివైడర్ ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాలువలో మురుగు నీరు తొలగింపునకు హైవే మెయింటినెన్స్ సిబ్బంది గురువారం పనులు ప్రారంభించారు. మురుగును తొలగించరూ...! శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి స్పందించిన హైవే మెయింటినెన్స్ సిబ్బంది జేసీబీ సహాయంతో రోడ్డును ఆనుకుని ఉన్న పూడికను తొలగించి మురుగు నీరు పారేందుకు మార్గం చూపడంతో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు తగ్గింది.

సస్యరక్షణ చర్యలతో అధికోత్పత్తి



డి.పోలవరం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మాధవి

తుని రూరల్: సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో వరిలో అధికోత్పత్తి సాధించవచ్చని కాకినాడ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవి అన్నారు. గురువారం తుని మండలం డి.పోలవరంలో ఏఈఓ పి.జగ్గాప్పారావు ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వరిలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పొట్టకుళ్లు తెగులు, కాండం కుళ్లు తెగులుతో తాలు గింజలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. వాటిని నివారణకు ప్రోపికొనజల్ మందు ఒక మిల్లీ లీటరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

పంట పొలాల పరిశీలన

తొండంగి: స్థానిక వ్యవసాయ క్షేత్రాలను జిల్లా వనరుల కేంద్రం పెద్దాపురం ఏడీఏ మాధవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రాల(ఫౌండేషన్ సీడ్) నుంచి వచ్చిన వరి విత్తనాలు మూడు పంటల వరకూ విత్తనాలను అభివృద్ధి చేసుకుని సాగు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించి అధిక ఉత్పత్తు పొందాలన్నారు. తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈవో కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, అధికారులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఈఎండీపీ సర్వే పత్రాల పంపిణీ

కిర్లంపూడి: విద్యార్థులు స్వశక్తితో ఎదిగేందుకు ఆంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఈఎండీపీ) ఎంతగానో కృషి చేస్తోందని హెచ్ఎం కల్యాణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిర పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే అనుమతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ ఎండీపీ ద్వారా విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలు, ఉద్యోగ కల్పన, సృజనాత్మకత, సమస్య పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వం వంటి వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్
- తెప్పోత్సవం, సత్యదేవుని గిరిప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు



మీడియాతో మాట్లాడుతున్న అన్నవరం ఈఓ

అన్నవరం: కార్తికమాసంలో సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన రత్నగిరిపై మీడియాతో మాట్లాడారు. శుక్రవారం జరిగే సత్యదేవుని తెప్పోత్సవానికి, ఈ నెల 27వ తేదీన కార్తిక పౌర్ణమి రోజున నిర్వహించే సత్యదేవుని గిరిప్రదక్షిణ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గిరిప్రదక్షిణకు సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు సత్యదేవుని తొలిపావంచా వద్దకు సత్యదేవుడు, అనంతలక్ష్మిఅమ్మవారిని మెట్ల మార్గాన ఊరేగింపుగా తీసుకువస్తారు. అక్కడ పూజలు చేస్తారు. అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు. మెయిన్‌రోడ్డు ద్వారా బెండపూడి శివార్లలోని పుష్కర కాలువ పక్క నుంచి సత్యగిరి కొండను దాటుకుని పంపా నదీ తీరానికి గిరిప్రదక్షణ చేరుకుంటుంది. మార్గమధ్యలో మూడు చోట్ల సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తారు. చివరగా పంపా నదీ తీరంలో పూజలు చేసిన తర్వాత 11.30 గంటలకు స్వామి, అమ్మవార్లను సత్యదేవుని ఆలయానికి చేరుస్తారు. గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తుల కోసం పండ్లు, పాలు, మజ్జిగ, పులిహోర, తాగునీరు పంపిణీ చేస్తారు.

తెప్పోత్సవానికి..

దేవస్థానంలో సత్యదేవుని దివ్య కల్యాణోత్సవం అనంతరం శుక్రవారం సాయంత్రం స్వామివారి తెప్పోత్సవం కనుల పండువగా జరగనుంది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ తెలిపారు. పంపా నదీ తీరం వెంబడి బారికేట్లు నిర్మించామన్నారు. తెప్పోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ తెప్పోత్సవం సందర్భంగా పంపా నది తీరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సత్యదేవుడు, అమ్మవార్లను విహరించే హంస వాహనాన్ని కూడా ముస్తాబు చేశారు. ఈ తెప్పోత్సవం నిర్వహించే పవర్ హౌస్ వద్ద గల పంపా నది తీరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెప్పోత్సవం సందర్భంగా ఘాట్ రోడ్ ముఖ ద్వారం నుంచి పవర్‌హౌస్ వరకూ రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గతంలో తెలుపు రంగు మీద లేత నీలం రంగు మచ్చలతో హంస వాహనాన్ని రూపొందించేవారు. అయితే ఈ సారి విజయవాడ కనకదుర్గమ్మ తెప్పోత్సవంలో హంసలా దీనిని ముస్తాబు చేస్తున్నట్టు దేవస్థానం విద్యుత్ శాఖ డీఈ సూర్యనారాయణ తెలిపారు.

ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం

తెప్పోత్సవాన్ని తిలకించేందుకు హాజరు కావల్సిందిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్రప్రసాద్, కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా తదితరులను ఆహ్వానించామని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రజాప్రతినిధులు, దేవస్థానం చైర్మన్, ఈఓ, ఇతర వీఐపీలు ఈ కార్యక్రమాన్ని ఒడ్డు నుంచి తిలకించేలా పంపా నదీతీరంలో వీఐపీ లాంజ్ ఏర్పాటు చేశారు. తెప్పోత్సవానికి వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం 150 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే గజ ఈతగాళ్లు, రెండు మోటార్ బోట్లను ఏర్పాటు చేశారు.

93 అడుగులకు చేరిన పంపా నీటిమట్టం



ముస్తాబైన పంపానదీ తీరం

పంపా రిజర్వాయర్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 93 అడుగులకు చేరుకుంది. పంపాలో తెప్పోత్సవం నిర్వహించేందుకు తగినంత నీటిమట్టం లేక దేవస్థానం అధికారులు ఈ నెల మొదటి వారంలో తీవ్ర ఆందోళన చెందారు. దేవస్థానం అధికారుల కోరిక మేరకు ఇరిగేషన్ సిబ్బంది పుష్కర, ఏలేరు నుంచి సుమారు 150 క్యూసెక్కుల నీటిని పంపాకు విడుదల చేయడంతో పంపా నీటిమట్టం గణనీయంగా పెరిగింది. దీంతో తెప్పోత్సవానికి నీటి ఇబ్బంది లేదు. శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 94 అడుగులకు చేరుకుంటుందని పంపా ఏఈ శ్రీదేవి తెలిపారు. కాగా, గురువారం మధ్యాహ్నం మరలా తెప్ప డ్రల్ రన్ వేయగా ఎటువంటి సమస్య లేకపోవడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానం ఏసీ రమేష్ బాబు, ఈఈ మురళీ కృష్ణ, డీఈ సూర్యనారాయణ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

కోటనందూరు: ఆడపిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ కే ప్రవీణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన బేటీ బచావో-బేటీ పఢావో (ఆడ పిల్లలను రక్షించు-ఆడ పిల్లలను చదివించు)పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీడీ ప్రవీణ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్షత చూపకూడదన్నారు. అందరినీ చదివించాలన్నారు. 18ఏళ్లు దాటిన తరువాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను, రక్షణకు అనేక చట్టాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుర్ల రాంబాబు, లెక్కల ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, సీడీపీఓ కే శ్రీలత, సూపర్‌వైజర్ వాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ